క్లుప్తంగా

234 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు



ఆర్‌బీకేకు ట్రాక్టర్లపై ధాన్యాన్ని తీసుకువస్తున్న రైతులు

కొయ్యూరు: రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు ధాన్యం తీసుకొస్తున్నట్టు ఏవో ఉమాదేవి బుధవారం తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ చింతలపూడి కేంద్రానికి ఇప్పటి వరకు 234 క్వింటాళ్ల ధాన్యం తీసుకొచ్చారన్నారు. రైతుల కళ్లాల వద్దకు సిబ్బంది వెళ్లి అక్కడ తేమను చూసి కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులు ఎవరు ధాన్యం విక్రయించాలని భావించినా ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. సామాన్య రకం క్వింటాకు రూ.2,183 చెల్లిస్తున్నట్టు తెలిపారు. గ్రామ వలంటీర్లు కూడా రైతులకు సాయం చేసి, ప్రభుత్వం ఇస్తున్న గిట్టుబాటును వివరించాలన్నారు. మరిన్ని వివరాల కోసం 1967 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

60 మందికి వైద్య సేవలు



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని మర్రిపాలెం, దాకరాయి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ఉచిత వైద్య శిబిరంలో 60 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు వైద్యాధికారి డాక్టర్ సుష్మా తెలిపారు. వీరిలో 8 మంది గర్భిణులు, బీపీ, సుగర్ ఉన్న 47 మంది, ఐదుగురు బాలింతలకు సేవలందించామన్నారు. 104 వాహనం సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



దగ్ధమవుతున్న పూరిల్లు

ఎటపాక: మండలంలోని గన్నవరం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన సంఘటనలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైంది. ఆ సమయంలో భూషణం తన కుమారుడు ఇంట్లో నిద్రిస్తున్నారు. ప్రమాదాన్ని గమనించి బయటకు పరుగులు తీశారు. వైర్లు కలిసిపోవడంతో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్టు బాధితుడు చెప్పారు. ప్రమాదంలో సుమారు రెండు లక్షల ఆస్తినష్టం జరిగినట్టు అధికారులు అంచనా వేసినట్టు బాధితుడు తెలిపారు.

డిప్యూటీ సీఎం రాజన్నదొరకు సన్మానం



రాజన్నదొరను సత్కరిస్తున్న భాషా పండిత, పీఈటీల సంఘం ప్రతినిధులు

జి.మాడుగుల: గిరిజన సంక్షేమ శాఖ భాషా పండిత, వ్యాయామ ఉపాధ్యాయుల ఉన్నతీకరణ చేసినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొరకు సంఘం ప్రతినిధులు శివకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో డిప్యూటీ సీఎం రాజన్నదొరను కలిసి శాలువా కప్పి సత్కరించారు.

రేల పండుగ కరపత్రాల విడుదల

చింతూరు: చింతూరులో ఫిబ్రవరి 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే ఆదివాసీ జాతీయ స్థాయి రేలపండుగకు సంబంధించిన కరపత్రాలను బుధవారం చింతూరులో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ప్రతినిధులు వెంకటరమణ, పూసం శ్రీను విడుదల చేశారు.



ప్రగతి దారులు

మన్యంలో ఏళ్ల తరబడి కనీస మరమ్మతుకు నోచుకోని రోడ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహర్దశ వచ్చింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో మన్యంలో కనీస అభివృద్ధి కరువైంది. పాలకులు పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేక గిరిజనులు నానా అవస్థలు పడ్డారు. గ్రామాలకు అత్యవసర సేవలు 108, అంబులెన్స్‌లు రాలేని పరిస్థితి ఉండేది.. సకాలంలో వైద్యం అందక గిరిజనులు ప్రాణాలు విడిచిన సందర్భాలు అనేకం.. రహదారులు లేక కాలినడకే శరణ్యమైంది.. చినుకుపడితే రహదారులు చిత్తడిగా ఉండేవి.. అదంతా గతం... జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మన్య ప్రాంతాభివృద్ధికి పెద్దపీట వేసింది. ఏజెన్సీలోని అన్ని గ్రామాల్లోనూ రహదారులు, వంతెనలు,కల్వర్టుల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలకు కోట్లాది రూపాయలు మంజూరు చేసింది. రోడ్ల ఏర్పాటుతో శివారు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. నాడు అధ్వానంగా ఉన్న దారులు నేడు అద్దంలా దర్శనమిస్తున్నాయి. రహదారులకు మోక్షం కలగడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చిక్కుడుబట్టి గ్రామం రహదారి



చింతపల్లి రూరల్ : టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి.. వర్షాకాలం వచ్చిందంటే చాలు గ్రామాల్లో అవసాల మీదుగా వర్షపు నీరు ప్రవాహించేది.. పారిశుధ్య సమస్య అధికంగా ఉండేది. కనీస డ్రైనేజీలు, సీసీ రోడ్లు కరువైంది. గ్రామాలన్నీ బురదమయంగా దర్శనమిచ్చేవి.. వర్షాకాలంలో గ్రామాల్లో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉండేది. పారిశుధ్య సమస్య కారణంగా గిరిజనులు నిత్యం రోగాల బారిన పడేవారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకునే నాథుడే కరువైన పరిస్థితి ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకమైన ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేతో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు కలిసి గ్రామాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా వెలుగులోకి వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఒక్కో గ్రామ సచివాలయానికి రూ.40లక్షల నిధులు కేటాయించింది. ఆయా నిధులతో ప్రధానంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు పూనుకుంది. దీంతో అనేక గ్రామాల్లో ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం పూర్తయింది. మరికొన్ని చోట్ల పనులు చివరిదశలో ఉన్నాయి.



చింతపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

- చింతపల్లి పంచాయతీలో 20 సీసీ రోడ్లకు రూ.56.3లక్షలు మంజూరు కాగా 12 చోట్ల రహదారులు పూర్తయ్యాయి.
- చౌడుపల్లి పంచాయతీలో 12 రోడ్లకు రూ.40లక్షలతో మంజూరు కాగా ఐదు రోడ్లు పూర్తయ్యాయి.
- కొమ్మంగి పంచాయతీలో తొమ్మిది రోడ్లకు రూ.40లక్షలు మంజూరు కాగా మూడుచోట్ల రహదారులు పూర్తయ్యాయి.
- కొత్తపాలెం పంచాయతీలో ఏడు రోడ్లకు రూ.35లక్షలు మంజూరు కాగా మూడు ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలు జరిగాయి.
- ఎర్రబొమ్మలు పంచాయతీలో 15 రోడ్లకు రూ.40లక్షలు కాగ 10రోడ్లు పూర్తయ్యాయి.

మండలం : చింతపల్లి

పంచాయతీలు	:	17
గ్రామాలు	:	245
జనాభా	:	80వేలు
'గడప గడపకు' ద్వారా మంజూరైన రోడ్లు :		141
మొత్తం నిధులు	:	రూ.4.56కోట్లు
చెల్లించిన మొత్తం	:	రూ.1.36 కోట్లు



చింతపల్లి పంచాయతీ చుంచుపాడు గ్రామంలో సీసీ రోడ్డు



కొమ్మంగి పంచాయతీ లంకపాకల గ్రామంలో నిర్మాణంలో ఉన్న రహదారి

సంతోషంగా ఉంది



ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు చాలా ఇబ్బంది పడేవాళ్లం. రోడ్డు ఎక్కడ కక్కడ గోతులు పడి పూర్తిగా శిధిలమయింది . వర్షాకాలం వస్తే గోతుల్లో నీరు చేరడం వల్ల పలుమార్లు ప్రమాదాల బారిన పడ్డాం. చీకటిపడితే ఆటోలు కూడా తిరిగేవి కావు.జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మా గ్రామానికి ఏళ్లనాటి రోడ్డు కల సాకారమైంది. పక్కా తారు రోడ్డు నిర్మించారు. చాలా సంతోషంగా ఉంది.

– కొర్ర లక్ష్మీ, చెరకుంపాకలు, లోతుగెడ్డ పంచాయతీ

అందుబాటులో రవాణా సౌకర్యం



గతంలో మా గ్రామానికి రహదారి, రవాణా సదుపాయం లేక చాలా ఇబ్బందులు పడ్డాం. ఎక్కడికి వెళ్లాలన్నా కాలినడకే శరణ్యమైంది. వర్షం కురిస్తే మట్టి రోడ్డు చిత్తడిగా మారడంతో నడిచేందుకు కూడా అవస్థలు పడ్డాం. జగనన్న ప్రభుత్వం వచ్చాక మా గ్రామంతో పాటు శివారు గ్రామాలకు రోడ్ల నిర్మాణం జరిగింది. రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

– పి.గోపాలకృష్ణ, చెరకుంపాకలు

చురుగ్గా రోడ్డు పనులు



మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో కూడా గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో ముమ్మరంగా సీసీ రోడ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. సీసీ రోడ్ల నిర్మాణం కోసం 4.56కోట్లు నిధులు మంజూరయ్యాయి. శివారు గ్రామాల్లోనూ సీసీ రోడ్ల నిర్మాణం పూర్తవుతుండడంతో గిరిజనుల సమస్య పరిష్కారం కానుంది.

– కె.బాలకిశోర్, మండల ఇంజనీరింగ్ అధికారి, చింతపల్లి

సీఎం జగన్ సభకు తరలిరండి



అరకులోయలో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, తదితరులు



నక్కలమెట్టలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ శివరత్నం, ఎంపీపీ కుమారి, నాయకులు

అరకులోయటౌన్: పాడేరు నియోజకవర్గం చింతపల్లిలో గురువారం జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభకు తరలిరావాలని మండల పార్టీ అధ్యక్షుడు లొక్కోయి లక్ష్మణ్ కోరారు. ఆయన బుధవారం విలేకరులతో ఏజెన్సీలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సభకు అన్ని ప్రాంతాల నుంచి అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కిల్లో రాజారమేష్, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు శెట్టి అప్పాలు, సాంబయ్య, నర్సింగరావు, జీనబంధు, దొన్ను, గురుమూర్తి, గణేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్గుణ

అరకులోయటౌన్: అల్లూరి జిల్లా పాడేరు నియోజకవర్గం చింతపల్లిలో గురువారం జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, గిరిజనులంతా తరలిరావాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగనన్న సభకు అరకులోయ నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులతో తరలివెళ్తున్నట్టు చెప్పారు. అభిమానులు, గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చి సీఎం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గూడెంకొత్తవీధి: చింతపల్లిలో గురువారం జరగనున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు శివరత్నం పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పలు గ్రామాల్లో విస్తృతం ప్రచారం చేశారు. సభ విజయవంతానికి కృషి చేయాలని కోరారు. ఎంపీపీ బోయినకుమారి, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, సర్పంచ్ సుభద్ర, నాయకుడు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



వీఆర్వోలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ త్రినాథనాయుడు

పాడేరు రూరల్: మండలంలోని ఈవీఎంల వినియోగంపై తహసీల్దార్ వి.త్రినాథనాయుడు బుధవారం వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందికి అవగాహన కల్పించారు. వారు గ్రామాల్లోకి వెళ్లి గిరిజనులు, ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పంచాయతీ కేంద్రంలో తప్పనిసరిగా సందర్శించాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి



గ్యాస్ కనెక్షన్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

రంపచోడవరం: గిరిజన మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్టు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఉజ్వల్ యోజన పథకం ద్వారా అర్హులకు మంజూరైన గ్యాస్ కనెక్షన్‌లను అందజేశారు. వారు మాట్లాడుతూ పేద గిరిజన కుటుంబాలకు అందిస్తున్న గ్యాస్ కనెక్షన్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగనన్న ప్రభుత్వ పేదల అభ్యున్నతి కోసం అనేక పథకాలు అమలుచేస్తోందన్నారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, జీసీసీ డీఎం జి.పార్వతీశం, ఎంపీడీవో హరికృష్ణ, సర్పంచ్‌లు బొజ్జయ్య, వెంకటలక్ష్మి, వి.ప్రసాద్, కె.ప్రసాద్‌దొర, దేవి, ఆనంద్, అన్నవరం డైరెక్టర్ పూజ, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మి, కృష్ణకుమారి, మాజీ ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామన్నదొర, నాయకులు రామకృష్ణదొర, శేఖర్ పాల్గొన్నారు.

ఆయాలకు పదోన్నతి పత్రాలు అందజేత

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి ఐసీడీఎస్ పరిధిలో ఇరువురు అంగన్‌వాడీ ఆయాలకు అంగన్‌వాడీ టీచర్లుగా పదో న్నతి లభించింది. ఈ మేరకు అడ్డతీగల మండలం ఎల్లవరంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంతబాబు పదోన్నతి పొందిన ఇరువురికి సర్టిఫికెట్లను అందజేశారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్



వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

సీలేరు: క్రిస్మస్ సమీపిస్తున్న తరుణంలో సీలేరులో క్రైస్తవ సోదరుల సందడి మొదలైయింది. సీలేరులోని యూసీఐఎం చర్చిలో బుధవారం ఐక్య క్రిస్మస్ వేడుక ఘనంగా జరిగింది. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శాంతా క్లాజ్ వేషధారణలో చిన్నారులు, పెద్దలు సందడి చేశారు. చర్చిలను క్రిస్మస్ స్టార్‌లు, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఘనంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు



హుకుంపేటలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హుకుంపేట: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ముందస్తుగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.సింహాచలం, ,జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం .విశ్వేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, నాయకులు సింహాచలం, కోటిబాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయం



ఎన్నికైన నూతన కార్యవర్గం

పాడేరు రూరల్ : మానవ హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం మానవ హక్కుల డిఫెండర్స్ పని చేస్తోందని అంతర్జాతీయ మానవ హక్కుల డిఫెండర్స్ జాతీయ అధ్యక్షుడు మినికేటర్ పట్నాయక్ స్పష్టం చేశారు. ఆయన పాడేరులో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కె.సింహాచలం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో 1/70చట్టం, విద్యా హక్కు చట్టం అమలు, గిరిజనుల ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సంఘం ప్రతినిధులు గిరి, ఈశ్వరరావు, సూర్యప్రకాష్, ఎస్.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు తక్షణమే పరిహారం

గూడెంకొత్తవీధి: జాతీయ రహదారి నిర్మాణంలో భూములను కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తక్షణమే నష్ట పరిహారం అందించాలని సీపీఎం మండల కార్యవర్గ సభ్యుడు గడుతూరి సత్యనారాయణ అన్నారు. రంపుల గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములను కోల్పోయిన బాధితులతో కలసి ఆయన ఆందోళన చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి బాబూరావు తదితరులున్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

మారేడుమిల్లి : మండల జీఎంవలస పంచాయతీ మాజీ సర్పంచ్ కొండా ఆనందమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆమె సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ తరపున సర్పంచ్‌గా, ఎంపీటీసీగా పనిచేశారు. ఆమె అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం



ఏనుగురాయిలో పథకాలపై వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల బోర్డును, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. జగనన్న అభివృద్ధి, సంక్షేమంలో విప్లవం తీసుకువచ్చి ఎంతో మంది పేద కుటుంబాలను ఆదుకున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. పారదర్శకంగా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అముచేస్తోందన్నారు. అనంతరం రాత్రి ఏనుగురాయి పంచాయతీ కేంద్రంలో పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో సర్పంచులు నరసింగరావు, రమేష్, బాబూరావు, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, నేతలు జయదేవ్, కొండలరావు, పులిరాజు, దాసు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ బాక ఈశ్వరి

డుంబ్రిగుడ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బాక ఈశ్వరి ఆధ్వర్యంలో బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి పాటుపడదామన్నారు.

ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి మండల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామని చెప్పారు. కిల్లోగుడ పీహెచ్‌సీలో అంబులెన్స్ డ్రైవర్లు రాత్రి వేళల్లో అందుబాటులో లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని, అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. గుంటసీమ సచివాయ సిబ్బంది విధినిర్వహణలో సమయపాలన పాటించడం లేదని పలువురు చెప్పారు. మండలంలోని వివిధ పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు, లలిత, ఎంపీడీవో ఉషారాణి, తహసీల్దార్ సీహెచ్.నాగమ్మ, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు హరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.